విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు

నిర్మల్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఆన్‌లైన్ ఎల్సీ (లైన్‌క్లియర్) యాప్‌ను ప్రవేశ పెడుతున్నామని నిర్మల్‌సర్కిల్ సూపరిం టెండెంట్ ఇంజనీర్ బి.సుదర్శనం శనివారం తెలిపారు. ఎల్సీలు తీసుకొని పనిచేసే సమ యంలో సమాచారలోపం, తదితర కారణాల వలన విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటన్నింటిని నివారించడానికి ఆన్‌లైన్ ఎల్సీ (లైన్‌క్లియర్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.ఈ యాప్ ద్వారా మానవతప్పిదాలను పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు.

వేడెక్కుతున్న.. రాజకీయం


రత్నాపూర్ కాండ్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు (ఫైల్)



బీజేపీ ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు (ఫైల్)

- పార్టీ కార్యక్రమాల్లో బిజీ బిజీగా ప్రధాన పార్టీల నేతలు
- వరుస కార్యక్రమాలతో జనాల్లోకి
- జై బాపు, జై భీం, జై సంవిధాన్ పేరుతో కాంగ్రెస్
- గావ్ ఛలో.. బస్తీ ఛలో కార్యక్రమం పేరిట బీజేపీ
- వరంగల్ రజతోత్సవ సభ కోసం బీఆర్ఎస్ ప్రజల్లోకి..

నిర్మల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వరుస కార్యక్రమాలతో బిజీ అవుతున్నాయి. పోటాపోటీగా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఈ మూడు ప్రధాన పార్టీలు రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. గత పది రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీ ఊరూరా చేపడుతున్న జై బాపు, జై భీం, జై సంవిధాన్ పేరిట చేపడుతున్న కార్యక్రమాలతో ఆ పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొంటోంది. కాంగ్రెస్ పార్టీ కేడర్‌నే కాకుండా స్థానిక ప్రజలను సైతం ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేస్తుండడం ఆ పార్టీ కేడర్‌కు జోష్ నిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి దీటుగా బీజేపీ కూడా గావ్ ఛలో.. బస్తీ ఛలో పేరిట ఈ నెల 10వ తేదీ నుంచి చేపట్టబోతున్న కార్యక్రమం ఆ పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేయనుందని అంటున్నారు. గత నెల రోజుల నుంచి వన్ నేషన్ వన్ ఎలక్షన్ పేరిట బీజేపీ బూత్‌స్థాయిలో నిర్వహిస్తున్న కార్యకర్తల సమావేశాలు విజయవంతం అవుతున్న కారణంగా ఆ పార్టీ కేడర్ సంబురపడుతోంది. దీంతో పాటు యువకులు, మహిళలు, రైతులను పెద్ద సంఖ్యలో పార్టీ వైపు ఆకర్షితులను చేసేందు కోసం బీజేపీ గావ్ ఛలో.. బస్తీ ఛలో కార్యక్రమం పేరిట వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. గ్రామీణ స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలకు గావ్ ఛలో పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే కార్యక్రమాలకు బస్తీ ఛలో కార్యక్రమాన్ని ఆ పార్టీ రూపకల్పన చేసింది. ఇలా కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా నిర్వహిస్తున్న కార్యక్రమాలతో పల్లెల్లో రాజకీయ వాతావరణం మారిపోయింది. ప్రస్తుతం ఎటు చూసి నా ఈ రెండు పార్టీల కోలాహలమే కనిపిస్తోంది. అయితే వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలను, స్థానికులను తరలించేందుకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. దీని కారణంగా ఇప్పుడిప్పుడే మొన్నటి ఓటమి భారం నుంచి తేరుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రజతోత్సవ సభ కార్యక్రమం తిరిగి పూర్వ వైభవం కల్పించనుందని ఆ పార్టీ కేడర్ భావిస్తోంది.

వరుస కార్యక్రమాలతో కాంగ్రెస్ పార్టీ బిజీబిజీ

ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ వరుస కార్యక్రమాలు నిర్వహిస్తూ తన పట్టును మరింత చాటుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే రుణ మాఫీ, రైతుబంధు, బీసీ రిజర్వేషన్‌తో పాటు సన్న బియ్యం పథకాలపై కాంగ్రెస్ పార్టీ ఊరూరా సీఎం చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు చేయడం అలాగే సంబురాలు జరపడంతో బిజీగా మారిపోయింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ గత పది రోజుల నుంచి జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తోంది. ప్రతిరోజూ రెండు మూడు గ్రామాలను లక్ష్యంగా చేసుకొని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలంతా తమ వ్యక్తిగత విబేధాలను పక్కన పెట్టి ఐక్యంగా పాల్గొంటుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ముఖ్యంగా నిర్మల్‌లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ముథోల్‌లో మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డిలు కూడా ఈ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ప్రతిరోజూ ఈ కార్యక్రమాన్ని ఏదో ఒక చోట నిర్వహిస్తుండడంతో జనం నాలుకలపై కాంగ్రెస్ పార్టీ పేరు నానుతోంది.

గావ్ చలో.. బస్తీ చలోతో బీజేపీ ప్రజల్లోకి..

ఇదిలా ఉండగా ఇప్పటికే వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పేరిట గ్రామస్థాయి నుంచి వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీజేపీ ఇక ప్రతీ అంశాన్ని ఓ కార్యక్రమంగా మార్చేందుకు ప్రయ త్నిస్తోంది. మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయ్ జయంతి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహించి పార్టీ కేడర్‌లో కదలిక తెచ్చే ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. దీంతో పాటు ఈ నెల 10వ తేదీ నుంచి గావ్ ఛలో.. బస్తీ ఛలో పేరిట కార్యక్రమాన్ని చేపట్టి ఇటు గ్రామ అటు పట్టణ ప్రాంతాల్లో పార్టీ కేడర్‌ను ఉత్తేజపర్చేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను గ్రామస్థాయిలోనూ అలాగే గల్లీ స్థాయిలోనూ ప్రజలకు వివరించేందుకు ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ నిధులే ఎక్కువగా ఉన్నాయన్న అంశాన్ని ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఆ పార్టీ ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసింది.

రజతోత్సవ సభపై బీఆర్ఎస్ పార్టీలో ఆశలు

మొన్నటి ఎన్నికల్లో ఘోరమైన ఓటమి కారణంగా జిల్లాలో పూర్తిగా డీలా పడిపోయిన బీఆర్ఎస్ పార్టీ తిరిగి పూర్వ వైభవం సాధించేందు కోసం గత రెండు సంవత్సరాల నుంచి అనేక రకాల తంటాలు పడుతోంది. లీడర్, కేడర్ కోల్పోయి ఆ పార్టీ ప్రస్తుతం గందరగోళ పరిస్థితులకు గురవుతోంది. ఈ నేపథ్యంలోనే పార్టీకి పూర్వ వైభవం కల్పించే దిశగా అధిష్ఠానం కసరత్తు మొదలుపెట్టింది. దీని కోసం వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభను భారీ ఎత్తున నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం తలపెట్టింది. అయితే జిల్లాలో మిగిలి ఉన్న కొంత మంది బీఆర్ఎస్ నేతలు ఈ రజతోత్సవ సభ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి కొంత మేరకైనా ఉన్న కేడర్‌లో ఉత్సాహం నింపడం కొత్త కేడర్‌ను తయారు చేసుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని యోచిస్తోంది.


బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నిర్వహణ నేపథ్యంలో నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశమైన మాజీ సీఎం కేసీఆర్ (ఫైల్)

నేడు భైంసాలో హిందూ వాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర

భైంసా, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం భైంసాలో హిందూవాహిని భారీ శోభాయాత్రను జరుపనుంది. గోశాల నుంచి శోభాయాత్ర ప్రారంభమై భట్టిగల్లీ, గణేష్‌నగర్, పద్మావతీ కాలనీ, పాత పోస్టాఫీస్, బస్టాండ్ రోడ్డు, నిర్మల్ క్రాస్‌రోడ్‌ల మీదుగా శోభాయాత్ర పిప్రికాలనీలోని రామ్‌లీల మైదానం వరకు కొనసాగనుంది. భారీ శ్రీరాముని విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించేందుకు గాను హిందూవాహిని శ్రేణులు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టాయి. భైంసా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 2 వేలకు పైగా మంది యువకులు శోభాయాత్రలో పాల్గొననున్నట్లుగా హిందూవాహిని ప్రతినిధులు వెల్లడించారు.


శ్రీరాముని విగ్రహం

● భారీ బందోబస్తు..

పట్టణంలో హిందూవాహిని ఆధ్వర్యంలో బుధవారం జరిగే శోభాయాత్రకు పోలీసుశాఖ భారీబందోబస్తు ఏర్పాటు చేపట్టింది. శనివారం ఏఎస్పీ అవినాష్‌కుమార్ శోభాయాత్ర సందర్భంగా ఏర్పాటు చేయనున్న బందోబస్తు ఏర్పాట్లపై సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని భైంసాటౌన్ సీఐ గోపీనాథ్, ఎస్ఐ ఎండీగౌస్, శ్రీనివాస్ యాదవ్‌లను ఆదేశించారు. శోభాయాత్రకు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఆధ్వర్యంలో టౌన్ సీఐ గోపినాథ్ భద్రతా చర్యలు చేపట్టారు. బందోబస్తులో ఐదుగురు సీఐలతో పాటు 10 మంది ఎస్ఐలు, 29 మంది ఏఎస్ఐలు, 175 మంది పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొననున్నారు. శోభాయాత్ర కొనసాగే మార్గంలో 56 కేంద్రాలను ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

● తరలివచ్చిన పోలీసు బలగాలు

సమస్యాత్మక ప్రాంతమైన భైంసాలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని హిందూవాహిని నిర్వహించే భారీ శోభాయాత్రకు పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. శోభాయాత్ర ఆద్యాంతం ప్రశాంత వాతవరణంలో కొనసాగేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు గాను పకడ్బందీ భద్రతా చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే బందోబస్తు విధుల నిర్వహణకు గాను ఇతర ప్రాంతాల నుంచి పోలీసు బలగాలు ఇక్కడికి తరలివచ్చాయి. మెదక్, సిద్దిపేట్, జగిత్యాల్ జిల్లాల నుంచి పోలీసు బలగాలను ఇక్కడి బందోబస్తు కోసం గాను తరలించారు.

● ఆలయాల ముస్తాబు

పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, బాగుబాయి గుట్ట సాయిబాబా మందిరాలు బుధవారం జరిగే శ్రీరామనవమి వేడుకల కోసం ముస్తాబయ్యాయి. ప్రతీ యేటా రెండు ఆలయాల్లోనూ శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జరుగనున్న వేడుకలకు గాను కమిటీల సభ్యులు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉండేందుకు గాను ఏర్పాటు చేపట్టారు. ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం వేళ వరకు ఆలయాల్లో శ్రీరాముని జన్మదిన వేడుకలు జరుగన్నాయి.


బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ

● మజ్జిగ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు

శోభాయాత్రలో పాల్గొనే భక్తులకు మజ్జిగ, చల్లటీ నీరు, ప్రసాదాలను అందించేందుకు గాను భైంసాలోని పలు సంఘాలు ఏర్పాట్లు చేపట్టాయి. ప్రధానరోడ్డు మార్గంలోని డా.మహిపాల్ ఆసుపత్రి ఎదురుగా శ్రీ లక్ష్మీ నర్సింహా యోగా గ్రూప్, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్, న్యూ మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ కమిటీలు మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేపట్టింది. ఇక నగేష్ క్లాత్ ఎంపోరియమ్ ఎదురుగా ఫ్రేండ్స్ ఫుట్‌బాల్ క్లబ్ భారీ అన్నదానాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది.

ప్రజల కోసం న్యాయసేవల విస్తరణ

● హైకోర్టు న్యాయమూర్తి

నిర్మల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింత చేరువగా న్యాయ సేవలందించే దిశగా కృషి జరుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ అలిశెట్టి పేర్కొన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధానకోర్టు ఆవరణలో కోర్ట్ ఆఫ్ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి 2 జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్‌కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోర్టుల విస్తరణతో న్యాయసేవలు చేరువవుతాయన్నారు. న్యాయ సేవలలో జాప్యం జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. న్యాయ వ్యవస్థ పటిష్ఠంగా ఉండడంతోనే అందరికీ వ్యవస్థపై నమ్మకం ఉందన్నారు.

ఖానాపూర్‌లో కోర్టు భవనం నిర్మించాలి...

నియోజకవర్గకేంద్రమైన ఖానాపూర్‌లో కోర్టు కోసం స్థలం కేటాయించి భవనాన్ని నిర్మించాలని కోరుతూ ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రరాజం సురేష్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ అలిశెట్టికి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో కోర్టును నిర్వహిస్తున్నారని దీంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయ ని వారు పేర్కొన్నారు. కోర్టు భవన నిర్మాణానికి కృషిచేస్తానని హైకోర్టు న్యాయమూర్తి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి కర్ణకుమార్, వివిధ కోర్టుల న్యాయాధికారులు, అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ఖానాపూర్ బార్‌అసోసియేషన్ కార్యదర్శి రాజలింగం, అసోసియేషన్ బాధ్యులు నేరెళ్ల సత్యనారాయణ, గుగ్లావత్ కిషోర్ నాయక్, ఎండీ ఖాజా, ఎర్ర రవి, ఏజీపీ ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.


కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

● కలెక్టర్ అభిలాష అభినవ్

● ఘన నివాళి

నిర్మల్‌కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ భారత ఉపప్రధాని డాక్టర్‌బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం నుంచి ప్రజలు ప్రేరణ పొంది ఆయన ఆదర్శాలను అనుసరించాలని, ఆయన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ...సమానత్వం, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని ఆయన సేవలను కొనియాడారు. ఆయనను స్మరించు కోవడం మనందరికి గర్వకారణమని తెలిపారు. జగ్జీవన్ జయంతిని జిల్లా స్థాయిలో అధికారికంగా నిర్వహిస్తు న్నట్టు పేర్కొన్నారు. దళితుల హక్కుల కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని అన్నారు. ఉపప్ర ధానిగా, కార్మిక, వ్యవసాయ, రక్షణ శాఖలకు మంత్రిగా పనిచేసి ఆ పదవులకు వన్నె తెచ్చారని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖల అధికారులు రాజే శ్వర్ గౌడ్, శ్రీనివాస్, అంబాజీ, శంకర్, సిబ్బంది, దళిత సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్

రాజ్యాంగ రక్షణకు పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది

● ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఖానాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఖానాపూర్ మండలంలోని ఆయన విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సత్తెనపల్లి, అడవి సారంగాపూర్, తర్లపాడ్, పాత తర్లపాడ్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసం గించారు. అనంతరం రాజ్యాంగంపై ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ఎమ్మె ల్యే ప్రతిజ్ఞ చేశారు. వేర్వేరు కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ భూమ న్న, వైస్‌చైర్మన్ అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్య క్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, పీఏసీఎస్ చైర్మన్లు ఇప్ప సత్యనారాయణ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషాఉన్నారు.

రాజ్యాంగ రక్షణకు పాటుపడాలి..

నిర్మల్‌రూరల్ : రాజ్యాంగ రక్షణకు పాటుపడాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి బాపూజీ చిత్రపటానికి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ ముడుసు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ నిర్మల్ కొరిపెల్లి రామేశ్వర్ రెడ్డి, భోజారాం, భీమ్‌రావు పటేల్ కుంటాల, మాజీ ఎంపీపీ సాధ సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సాధ విజయ్, నవీన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భోజన్న ఉన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

మృతుల కుటుంబసభ్యులను ఆదుకుంటాం

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్


మృతుని కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

భైంసా, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం భైంసాలో గత సంవత్సరం విద్యుదాఘాతం భారిన పడి మృతిచెందిన వానల్‌పాడ్ గ్రామంలోని బాధిత కుటుంబానికి విద్యుత్‌శాఖ ద్వారా మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్‌ప్రమాద మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రభుత్వం ద్వారా ఇతర సహాయ, సహకారాలు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. ఇందులో బీజేపీ ప్రతినిధులు సాంఘ్లీ రమేష్, బెల్‌తరోడా గ్రామ మాజీసర్పంచ్ గోప సాయినాథ్ , భైంసా ఏడీఈ ఆదిత్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

'మర్సుకోల రాంజీగోండు వర్ధంతి సభను విజయవంతం చేయండి'

ఉట్నూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన ఆదివాసీ మొదటి అమరవీరుడు మర్సుకోల రాంజీగోండు 165వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. ఇందులో మర్సుకోల రాంజీగోండు ఆశయ సాధన సమితి ఉమ్మడి ఆదిలాబాద్ చైర్మన్ మర్సుకోల తిరుపతి, సలాందేవ్‌రావు, సుంకట్‌రావు, భక్తు రాజన్న, గేడం సుభాష్, తదితరులున్నారు.

'ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలి'

జైనథ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ వేడుకున్నారు. శనివారం ఉమ్మడి జైనథ్ మండలంలోని మాండగడ గ్రామంలో మురళీకృష్ణ ఆలయంలో నిర్వహించిన ఆలయ ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో సుందర చైన్య సత్సంగ సభ్యులు నర్సింగ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, నర్సింగ్ లచ్చారెడ్డి, ఆశన్న, గణేష్, విఠల్, మాండగడ గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

● 'ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి'

జైనథ్: సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌనారెడ్డి అన్నారు. శనివారం ఉమ్మడి జైనథ్ మండలంలోని మాండగడ గ్రామంలో నిర్వహించిన శ్రీమురళికృష్ణ ఆలయం ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నేరడిగొండ ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని వడూర్ గ్రామంలో యువకులు నిర్వహించిన వడూర్ క్రికెట్ ప్రీమియం లీగ్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ క్రికెట్ ఆడి ప్రారంభించారు. అనంతరం వడూర్ గ్రామంలో పర్యటించి బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీకాంత్ ఏర్పాటు చేసిన చలి వేంద్రం ప్రారంభించారు. ఇందులో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ జహీర్, మాజీ వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, నేరడిగొండ వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో గత నెల 16వ తేదీ నుంచి కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఇందులో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ సర్పంచి సునీత, మాజీ ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

బోథ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రమేష్ శనివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో కూలీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. అంతేగాక ఉపాధి హామీ పనుల కొలతలను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో జగదే రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి : ఆడె

నేరడిగొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. అధిష్ఠానం పిలుపు మేరకు శనివారం మండలంలోని యాపల్ గూడ నుంచి ఇస్రుగూడ వరకు ఆడే గజేందర్ ఆధ్వర్యంలో జరిగిన జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అందరం కలిసి పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అర్క యాదవ్, భీమ్ రావు పటేల్, సీతారాం, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, మురలి, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

● ఆదిలాబాద్ జిల్లాలో అధికారులు, నాయకుల ఘన నివాళి

సిరికొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప రాజకీయవేత్త, దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ జీవిత ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో రవీందర్ సూచించారు. అంటరాని వారికి సమానత్వం కోసం, సమాజంలో అణగారిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారం, ఏపీవో భీంరావ్, సిరికొండ మండల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఓరగంటి పెంటన్న, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు షేక్ ఇమామ్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, ఎండీ రషీద్, గురుమూర్తి, గోపి నరేష్, శ్రీనివాస్, సురేష్, విలాస్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సమాజంలో పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రాం కమిటీ అధ్యక్షుడు కొత్తూరి లక్ష్మణ్, డీఎస్‌పీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, సభ్యులు పొనకంటి ఆశన్న, సిరిసిల్ల భూమన్న, సుభాష్, వెంకటేష్, వీడీసీ సభ్యులు జల్లెజాకు, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: భారతదేశ ఉపప్రధాని కేంద్రమంత్రి, మాజీ మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రమైన జైనథ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అటు జైనత్ బికేపీ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేష్‌రెడ్డి, నాయకులు కె.దేవన్న, చిల్కచిన్నన్న, కె.లస్మన్న మాజీ ఎంపీటీసీ కె.సుదర్శన్‌లతో పాటు యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జైనథ్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



ఇచ్చోడలో నివాళులు అర్పిస్తున్న అధికారులు, నాయకులు

మావల: అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసి స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా తన పరిపాలనా దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలందించిన మన భారత దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ సేవలు యావత్ భారత జాతి ఎన్నడూ మరిచిపోదని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బాబు జగ్జీవన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తిత్వం కలిగినవారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు రంజిత్, కాంగ్రెస్ సినియర్ నాయ కులు నవీన్ రెడ్డి, మాజీ ఎన్‌ఎస్‌యూ నాయకులు నరసింహ చారి, మాజీ ఎంపిపి గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు శ్రమించిన పోరాడిన గొప్ప మహనీయుడని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్వహించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలలో నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో సాయిప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ మోతీరాం, సురేష్ ఆడె, నర్సింగ్ మొరే, కాంతారావు దుర్గే, దాదే అల్లి, చవాన్ ప్రకాష్, కోరెల మహేందర్, రాము టైలర్, కౌసర్, ప్రకాష్ పాల్గొన్నారు.

'కేసీఆర్ సభను విజయవంతం చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచేస్థాయిలో ఉంటుందని అందుకు పార్టీ కార్యకర్తలంతా కలిసి కట్టుగా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కోరారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్, జైనథ్, బేల, రూరల్ మండలాల నాయకులు, నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను అట్టహాసంగా జరపనున్నట్లు తెలిపారు. ఈనెల 27న వరంగల్‌లో జరుగనున్న బహిరంగ సభ, పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణపై సమావేశంలో పార్టీ శ్రేణులకు నిర్దేశం చేసి పలు సూచనలు చేశారు. ఇందులో లింగారెడ్డి, సావాపూరే విజయ్, మారిశెట్టి గోవర్ధన్, ఊశన్న, ప్రభాకర్, బోజన్న, నల్ల మహేందర్, వేణుయాదవ్, బట్టు సతీష్, దేవన్న, గంద్రత్ రమేష్, కొమ్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

తలమడుగు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసాయి గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో గల అతి పురాతనమైన సంకట యోజన హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్ష పరులు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు సంవత్సరాది ఉగాది తర్వాత వచ్చిన మొదటి శనివారం త్వరలో రాబోతున్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల వంద సంవత్సరాల చరిత్ర కలిగిన హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పూజలతో అన్నదాన కార్యక్రమాన్ని చేపడతారు. ఈనెల 12 హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేపడుతున్నారు. హనుమాన్ జయంతికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'నామినేటెడ్' ఇంకెప్పుడు?

(5వ పేజీ తరువాయి...)

తలనొప్పిగా మారిందంటున్నారు. ప్రతీ నియోజకవర్గంలోనూ రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి కాంగ్రెస్ నేతలు పని చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ కార్యక్రమాల్లోనూ వేర్వేరుగానే పాల్గొంటూ పని చేస్తున్నారు. నేతల మధ్య సఖ్యత లేక పోవడంతో నామినేటెడ్ పదవులపై అధిష్ఠానం పెద్దలు ఒక నిర్ణయానికి రావడం లేదన్నట్లు తెలుస్తుంది. ఓ వర్గానికి నామినేటెడ్ పదవిని కేటాయిస్తే.. మరోవర్గం అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం కనిపిస్తుంది. ఎవరికి వారే పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అభివృద్ధి పనులతో పాటు నామినేటెడ్ పదవుల సిఫారస్సుల్లోను నేతలు పట్టుబడుతున్నారు. ఇది వరకే ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ప్రభుత్వం ప్రకటించినా.. కొందరు నేతలు అడ్డుకున్నారన్న ప్రచారం జరుగుతుంది. ముఖ్యనేతల పర్యటనల్లోనూ నేతల మధ్య సఖ్యత కనిపించడం లేదు. పార్టీలో సీనియర్, జూనియర్ నేతల మధ్య గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తుంది. అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మృతదేహాల కోసం గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో మృతి చెందిన సంజీవ్, రాహుల్ (ఫైల్)

స్నానానికి వెళ్లి.. ఇద్దరు విద్యార్థుల మృతి

● ఆదిలాబాద్ జిల్లా మావలలో విషాదం

మావల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన శనివారం ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మావల ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని 170 కాలనీకి చెందిన చిప్పకుర్తి సంజీవ్, కామ్లే రాహుల్, కామ్లే విశాల్ అనే ముగ్గురు విద్యార్థులు మావల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. సంజీవ్ 5వ తరగతి, రాహుల్ 4వ తరగతి చదువుతున్నారు. అయితే, శనివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో మావల సమీపంలోని ఎర్ర నీటిగుంట చెరువు వద్దకు స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి గుంట లోతుగా ఉండటంతో అందులో సంజీవ్(11) రాహుల్(11)లు మునిగిపోయారు. బయటకు వచ్చిన రాహుల్ తమ్ముడు విశాల్ ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. దీంతో హుటాహుటిన కుటుంబీకులు చెరువు వద్దకు వచ్చి చూసేసరికి ఇద్దరు చెరువులో గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీసి పంచనామా నిర్వహించారు. కాగా ఇద్దరు విద్యార్థులు మృత్యువాత చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

నేరడిగొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండంలోని కుప్టీ హైవేలో తెల్లవారుజాము రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో దిలీప్(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దిలిప్ రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దిలీప్ గుర్జర్ చొప్రకిధాని గ్రామం నాగూర్ జిల్లా రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవాడు కావడంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. అతి వేగం, అజాగ్రత్తతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందన్నారు.

ముస్తాబైన శ్రీ జగదాంబ దేవీ ఆలయం



ముస్తాబైన జగదాంబ దేవీ ఆలయం

పెంబి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిగూడ గ్రామంలోని శ్రీ జగదాంబ దేవి, ప్రకాష్ మహారాజ్ ఆలయం జాతరకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి నుంచి రెండు రోజులపాటు జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం జగదాంబ దేవి, శివపార్వతుల ఊరేగింపు, ఆలయంలో ప్రత్యేకపూజలు, యజ్ఞ కార్యక్రమాలు, మంగళవారం ప్రకాష్ మహారాజ్ ఆశీస్సులు, జాతర, బలిదానం, శ్రీ ప్రకాష్ మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు.

ఘనంగా సామ్రాట్ అశోకచక్రవర్తి జయంతి

భైంసా, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శనివారం సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బౌద్ధ మహాసభ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బుద్దవిహార్‌లో నిర్వహించిన జయంతి వేడుకలకు జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు వాగ్మారే అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కేంద్ర శిక్షక్ యువరాజ్ మోరే, ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ గడ్పాలేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బౌద్ధ మహాసభ శ్రేణులు గౌతం బుద్దుడు, డా.బీఆర్ అంబేద్కర్, సామ్రాట్ అశోక్ చక్రవర్తి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి బుద్దవందన సమర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భీకరకళింగ యుద్ధ అనంతరం సామ్రాట్ అశోక చక్రవర్తి యుద్ధమార్గాన్ని వదిలి బౌద్ధధర్మాన్ని ఆశ్రయించారని వివరించారు. శాంతి, సహనం, ఓర్పు, అహింస, సత్యంచ ధర్మం మార్గాన్ని ఎంచుకొని అందుకు అనుగుణంగా వ్యవహరిస్తూ ముందుకు సాగారని తెలిపారు.

అలరించిన అష్టవధానం

భైంసా, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని వేదం తపోవనం హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన అష్టావధానం తెలుగు భాషాభిమానులను అలరించింది. ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.వీ. పట్వర్ధన్ అవధానిగా కడారి దశరథ్ సంచాలకులుగా వ్యవహరించారు. ఇందులో పృచ్ఛకులు డా.కోవెల శ్రీనివాసాచార్యులు, దాసరి సాయన్న, జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్, పీసర శ్రీనివాస్ గౌడ్, బసవరాజు, కొండూరు పోతన్న, గంగుల చిన్నన్న, నల్ల రాంకిషన్‌లు హాజరయ్యారు.

హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయండి

ఖానాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌గడ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ప్రజా ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ కోరారు. ఈ మేరకు శనివారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ... ఆపరేషన్ కగార్ పేరిట ప్రభుత్వాలు వందలాది మంది ఆదివాసీల హత్యాకాండకు పాల్పడుతున్నాయన్నారు. ఈ హత్యాకాండను వ్యతిరేకిస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ ఎదుట నిర్వహిస్తున్న ప్రజా ధర్నా కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, మానవతా వాదులు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, గోనె స్వామి, ప్రసాద్, గంగన్న, రాములు, తదితరులున్నారు.

8న అఖిల భారత నిరసన దినం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న అఖిల భారత నిరసనదినం పాటించాలని సీపీఐ మాస్‌లైన్ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం భగత్ సింగ్ భవన్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజన్న, గంగన్న, గంగామణి, లక్ష్మీ, లలిత పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... అందరికీ సమానత్వం కల్పించడంలో అతను కీలక పాత్ర పోషించాడన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, నాయకులు జమాల్, సత్యం చంద్రకాంత్, మల్లేష్, హిందూవాహిని బజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం బీజేపీ కార్యాలయంలో నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ... జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, మోర్చా అధ్యక్షుడు రాచకొండ సాగర్, టెలికాం బోర్డు మెంబర్ రమేష్, సుంకరి సాయి, దశరథ్ పోశెట్టి, ఆడెపు లలిత, సుధాకర్, అయ్యన్నగారి రాజేందర్, అల్లం భాస్కర్, రచ్చ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు. నిర్మల్‌లోని విజయ హైస్కూల్‌లో శనివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈసీ మెంబర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి విలాస్ పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఎస్ఎన్ రెడ్డి, పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, గ్రామపంచాయతీతో పాటు మండలంలోని మోచీసంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివా ళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్, ఆర్ఐ నారాయణ పటేల్, అధికారులు పాల్గొన్నారు.

బాసర : దళితుల అభ్యున్నతికి కృషిచేసిన ఆదర్శ వ్యక్తి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శనివారం బాసర మండల కేంద్రంలో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు పలువురు మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించి దళిత జాతి అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం కృషి చేశారని కొనియా డారు. కేంద్ర మంత్రిగా, తొలి ఉపప్రధాన మంత్రిగా అందించిన సేవల గురించి వివ రించారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి అని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీజేపీ నాయకులు సతీశ్వర్ రావు, పోగుల రాజేశ్వర్, సాయినాథ్ పటేల్, దళితనాయకులు బీ. రమేష్ పాల్గొన్నారు. బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో శని వారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఓఎస్‌డీ మురళీ దర్శన్, ఏవో రణధీర్ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సమాజంలో పేద, వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

లక్ష్మణచాంద : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాబూజగ్జీవన్ రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, సిబ్బంది రాజేందర్, దినకర్, చరణ్, సుధాకర్, లింగన్న, తదితరులు ఉన్నారు.



బాసరలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో ఎమ్మెల్యే రామరావు పటేల్



లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయంలో..

విద్యార్థులు బాగా చదివి.. ఉన్నత రంగంలో స్థిరపడాలి

● డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాగా కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం సాధించాలని, ఉన్నత రంగంలో స్థిరపడాలని నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని కనకాపూర్‌లో నిర్వహించిన'అక్షర హైస్కూల్ అన్యువల్ డే మహోత్సవం కార్యక్రమానికి శనివారం సాయంత్రం హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్ కోసం దిశానిర్దేశం చేశారు. బాలబాలికలు పోటీపడి చదవాలని, మంచి మార్కులు, ర్యాంకులు సాధించి జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఉత్సాహపరిచారు. ఈ ఉత్సవ సందర్భంగా అక్షరహైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, వైస్‌చైర్మన్ ఈటల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ సర్పంచ్‌లు అబ్బడి ప్రతాప్ రెడ్డి, మేకల రాజేందర్ యాదవ్, పాఠశాల డైరెక్టర్లు కోండ్ర నరేష్ రెడ్డి, నూతికాడి రాజారెడ్డి, తదితరులున్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీసీసీ అధ్యక్షులు

ఉత్సవాల నిర్వహణకు ఎమ్మెల్యే విరాళం



చామన్‌పెల్లిలో చెక్కును అందజేస్తున్న బీజేపీ నాయకులు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ శాసనసభా పక్షనేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలో ఇస్తానని హామీ ఇచ్చిన రూ.1,25,000 వేలను బీజేపీ మండల నాయకులతో చామన్ పెల్లి రామాలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. శ్రీరామ నవమి ఉత్సవాల నిర్వహణ కోసం సహాయం చేయాలని చామన్‌పెల్లి గ్రామస్థులు గత నెల 31న మహేశ్వర్ రెడ్డిని కలువగా రూ.1,25,000 ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వారికి అందజేసినట్లు చామన్‌పెల్లి గ్రామస్థులు తెలిపారు. ఈ మొత్తాన్ని సీతారాముల కల్యాణ మహోత్సవానికి వినియోగించనున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు గాండ్ల చిన్నయ్య, నాయకులు అద్వాల రమేష్, ఓస రాజు, వెంకట్ రెడ్డి, అయిట్ల సుదర్శన్, ప్రశాంత్‌రెడ్డి, ఏలేటి మహిపాల్ రెడ్డి, బర్ల సాయన్న, కొమ్ముల మహిపాల్ రెడ్డి, పడిగెల సురేష్, సుంకరి శ్రీను, బొమ్మెన రాజేందర్, తదితరులు ఉన్నారు.

లక్ష తలంబ్రాలు సిద్ధం..

లక్ష తలంబ్రాలను మండలంలోని చామన్‌పెల్లి గ్రామస్థులు శనివారం సిద్ధం చేశారు. శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఆదివారం జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి వీటిని వినియోగించనున్నారు. కాగా గత మూడు రోజులుగా చామన్‌పెల్లి రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. కల్యాణ మహోత్సవం అనంతరం స్థానికులు అన్నదానం నిర్వహిస్తారు.

సొసైటీల సేవలను రైతులు వినియోగించుకోవాలి

సారంగాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సొసైటీలు రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలో గల ఆలూర్‌లో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. రైతుల సౌకర్యార్థం కోసం ఎరువులను, విత్తనాలను అందుబాటులో ఉంచాలని అలాగే రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు

చాక్‌పల్లి గ్రామం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



తీవ్ర గాయాలైన భోజన్న

నర్సాపూర్(జి), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాక్‌పల్లి గ్రామం వద్ద మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో ఘోరరోడ్డుప్రమాదం జరిగింది. చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి భోజన్న తన ద్విచక్రవాహనంపై చాక్‌పల్లి గ్రామం నుంచి తన సొంత పొలానికి వెళ్లే దారిలో రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామానికి చెందిన గొల్ల మాడ అజయ్ వాహనం నడుపుకుంటూ దిలావర్‌పూర్ వెళ్తున్నాడు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి భోజన్నకు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో నిర్మల్ ఆసు పత్రికి తరలించారు. భోజన్న కాలు విరగడంతో తీవ్రరక్తస్రావమైందని వైద్యులు తెలిపారు.

ఆశాజనకంగా వేరు శనగ పంట

● తగ్గిన సాగు విస్తీర్ణం



ఆశాజనకంగా కనిపిస్తున్న వేరుశనగ పంట

తాంసి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వేరు శనగ పంట ఆశాజనకంగా కనిపిస్తుంది. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం పంటకు కావలసిన రీతిలో వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. దీంతో ఈ సంవత్సరం వేరుశనగ పంటపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తు తం వేరు శనగ పంటకు కావలసిన రీతిలో వాతావరణ పరిస్థితులు ఉండడంతో ఆశాజనకంగా కనిపిస్తుంది. కనీసం తమ కష్టాలను ఈ పంట అయిన తీరుస్తుందని ఆశతో ఉన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం వేరు శనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందనే చెప్పవచ్చు. మండలంలో ఈసారి సుమారు 80 హెక్టార్లలో వేరుశనగ సాగు అవుతుంది. కొంత మంది రైతులు వేరుశనగ విత్తనాలు నాటి 50 నుంచి 65 రోజులు కావస్తుంది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉండటంతో రైతుల ఆశలన్నీ ఈ పంటపైనే ఆధారపడి ఉన్నాయి. కనీసం వేరు శనగ పంట అయిన రైతన్నను ఆదుకోవాలని ఆశిద్దాం.

● తగ్గిన సాగు విస్తీర్ణం

గతంతో పోలిస్తే ఈ సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో వేరు శనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని చెప్పవచ్చు. మూడు నెలల ముం దుగానే పత్తి పంట పూర్తవ్వడంతో రైతులు ఆ పత్తి పంటను తొలగించి వేరు శనగ సాగుకు సమాయత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వందల హెక్టార్లలో సాగు అయ్యేలా కనిపిస్తుం దని పలువురు పేర్కొం టున్నారు.

● వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలి

ప్రస్తుతం వేరు శనగ పంట ఆశాజనకంగా కనిపిస్తుంది. పంటలపై చీడపీడల ప్రభావం కూడా అంతగా కనిపించడం లేదు. ప్రస్తుతం వాతావరణం కూడా అనుకూలంగా ఉంది. అయితే పంటకు తెగుళ్లు సోకే సమయంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సకాలంలో స్పందించి తమకు సూచనలు అందించాలి. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి. గతం కంటే ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలి.

ఆంధ్రజ్యోతి పరిశీలన



వర్షాకాలంలో నీటిలో మునిగిన గుండేగామ్ (ఫైల్)



శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లు



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

గుండేగాం వాసులకు శాపం.. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు

● గుండేగామ్ వాసుల గూడు.. గోస తీరదా..!? ● తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వేడుకోలు

భైంసా రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నిర్మాణంతో భైంసా మండలం గుండేగామ్ ప్రజలకు గూడు కోత మిగిలింది. సంవత్సరాల తరబడి గుండేగామ్ ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో ఉంచుకొని నివసిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ముందుచూపు లేకుండా 2017లో నిర్మించిన ప్రాజెక్టు గుండేగామ్ ప్రజలకు శాపంగా మారింది. వర్షాకాలంలో ప్రాజెక్టులో వెనుకతట్టు నీరు భారీగా రావడంతో రాత్రికి రాత్రి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని తరలివెళ్లి బంధువుల ఇంటి వద్ద తలదాచుకున్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాన్ని సందర్శించి పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సంవత్సరాలు గడిచినా హామీలు మాత్రం మటలకే పరిమితమయ్యాయి. గ్రామస్థులు రాజకీయ నాయకులకు, అధికారులను తమ బాధలు చెప్పినా పట్టించుకునే నాథుడే లేడు.

నేటికి పరిష్కారం కాని సమస్య

గ్రామంలో 217 కుటుంబాలకు అధికారులు భైంసా సమీపంలో డబుల్ బెడ్ రూమ్‌లను తాత్కాలికంగా పునరావాసం కల్పించారు. కానీ అక్కడ అరకొర వసతులతో జీవనం కొనసాగిస్తున్నారు. గ్రామంలో ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో నివసించడానికి వీలు లేదు. 30 నుంచి 40 కుటుంబాలు బంధువుల గ్రామాల్లో, అద్దెకు ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. కొత్త ప్రభుత్వం పునరావాసం కోసం గుండేగామ్ వాసులు కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలు పెంచుకున్నారు. కొత్త ప్రభుత్వం తమ ఇబ్బందులు తీరుస్తుందని ఎదురుచూస్తున్నారు. పునరావాసం కల్పిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంవత్సరం గడిచినా కూడా ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్టు పునరావాసంపై ఇప్పటి వరకు ఎటువంటి సమస్య పరిష్కరించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మాపై కనికరించి తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రంగారావు పల్సికర్ ప్రాజెక్టు నిర్మాణంతో ఇబ్బందులకు గురవుతున్నాం

● పవర్ బాబు, గుండేగామ్ వాసి



రంగారావు పల్సికర్ ప్రాజెక్టు నిర్మాణంతో బ్యాక్ వాటర్‌తో అనేక ఇబ్బందులకు గురవుతున్నాము. ప్రాణాలు గుప్పిట్లో ఉంచుకొని జీవనం సాగిస్తున్నాము. ఎన్నికల కంటే ముందు సర్వేసులు చేసి ప్రతిపాదనల కోసం మా గ్రామానికి వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేడు. ఇప్పటికైనా మా సమస్యలు గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నాము.

వర్షాకాలంలో భయంతో జీవనం సాగిస్తున్నాం

● సూర్యవంశీ బల్వంత్ పాటిల్, గుండేగామ్ వాసి



భైంసా పట్టణ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లో తాత్కాలికంగా ఉంటున్నాము. మేము వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాము. అధికారులు మాకు శాశ్వత పరిష్కారం కల్పించాలని గుండేగామ్ ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సాంస్కృతిక పోటీలు



నృత్యం చేస్తున్న చిన్నారి



నృత్య ప్రదర్శనలు చేసిన చిన్నారులు

ముథోల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆష్ట గ్రామంలో రామనవమి పురస్కరించుకొని స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శాస్త్రీయ సాంస్కృతిక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు ఈ పోటీలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక నృత్యాలతో అందరిని ఆకట్టుకునేలా నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ రంగు సౌమ్య సంపత్ తనకున్న కళా నైపుణ్యంతో నృత్య ప్రదర్శన ఇస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రామాలయ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఈ పు ణ్యక్షేత్రం మహా పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావు శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆలయం అభివృద్ధి చేయడానికి అందరి సహకారాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు రావుల పోశెట్టి, సురుగుల పోశెట్టి, కే.అశోక్, బొంగు సాయిలు, బాలగారి ముత్యం, సునీల్ గురుస్వామి, సట్ల ప్రసాద్, గ్రామస్థులు, ఆయా గ్రామాల నుంచి భక్తులు, తదితరులు పాల్గొన్నారు. ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ఘనంగా పొరకబండ్ల శోభాయాత్ర

● వినాయకచౌక్‌లో ధ్వజారోహణ చేసిన ఏఎస్పీ కాజల్‌సింగ్





ధ్వజారోహణం చేస్తున్న ఏఎస్పీ కాజల్‌సింగ్, ఉట్నూర్‌లో మహిళలతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్న ఏఎస్పీ కాజల్‌సింగ్

ఉట్నూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉట్నూర్ రాంనగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ సీతారాముల ఆలయంలో ఆదివారం జరగనున్న కల్యాణం కోసం ముందుగా శనివారం పచ్చని పొరక బండ్ల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని వినాయకచౌక్‌లో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఎడ్ల బండ్లలో తెచ్చిన పొరకకు ఏఎస్పీ కాజల్‌సింగ్ హిందూ ఉత్సవ సమితి నాయకులు మహిళల మంగళహారతులు మధ్య పూజారి దూబే ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం పొరక బండ్ల శోభాయాత్రను ఏఎస్పీ ప్రారంభించారు. ఉట్నూర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా మీదుగా రామాలయానికి శోభాయాత్ర చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన పందిళ్లపై పచ్చని పొరక పేర్చారు. ఆదివారం ఉదయం నాలుగు గంటలకు నగర సంకీర్తన, ఏడు గంటలకు ధర్మ ధ్వజారోహణం, 8గంటలకు గోమాత, తులసి పూజలు, 10గంటలకు సీతారాముల కల్యాణం తలంబ్రాల ఊరేగింపు, 11.45 గంటలకు సీతారాముల కల్యాణం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శ్రీ సీతారాముల కల్యాణంలో ఖానాపూర్ శాసనసభ్యులు బొజ్జుపటేల్, రేటిగూడ గీత ప్రచార కేంద్రం నిర్వాహకులు శ్రీహరి మౌన స్వామి, వివిధ శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మనోహర్, అధ్యక్షుడు పాత రవీందర్, డాక్టర్ సాడిగే రాజగోపాల్, షికారి శ్రీనివాస్, బోడిగామ రాములు, రాణి తదితరులు పాల్గొన్నారు.



పొరకబండ్ల శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

అధ్వానంగా రహదారి

● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు ● ఏళ్లు గడిచినా మారని దుస్థితి

జర దేఖో!!



అధ్వానంగా మారిన రాజాపూర్ రహదారి

కుంటాల, ఏప్రిల్, 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని గ్రామాలకు రహదారులను నూతనంగా మంజూరు చేసి తారు రోడ్లను సైతం వేయించింది. పదేళ్ల నుంచి కుంటాల మండలంలోని రాజాపూర్ గ్రామానికి ఉన్నటువంటి రహదారి మట్టి రోడ్డుగానే ఉంది. అయితే అప్పటి ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో ఈ రహదారిని తారు రోడ్డుగా మార్చేందుకు కోటి 16 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యమో, సంబంధిత కాంట్రాక్టర్ల అలసత్వమో కాని ఈ గ్రామస్తుల కల నెరవేరలేదు. రెండేళ్ల క్రితం రోడ్డు పనులు ప్రారంభించిన గుత్తేదారు తూతూ మంత్రంగా కంకర వేసి తారు వేయకపోవడంతో గ్రామస్థులకు ఈ రహదారిపై నడవడం చాలా ఇబ్బందిగా మారింది.

అసంపూర్తిగా వదిలేశారు

మండల కేంద్రం కుంటాల నుంచి ఓలా రహదారి పక్క నుంచి రాజాపూర్ గ్రామానికి గతంలో మట్టి రోడ్డు ఉండేది. అయితే తెలంగాణ రాష్ట ప్రభుత్వం అప్పట్లో గిరిజన తండాలకు తారు రోడ్డు వేయాలనే ఉద్దేశంతో ఐటీడీఏ నుంచి నిధులు మంజూరు చేయించి టెండరు ప్రక్రియ పూర్తి చేసింది. అందుకు సంబంధించిన అప్పటి ప్రజా ప్రతినిధులు రోడ్డు పనులను ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ఈ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే సంబంధిత శాఖ అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

వర్షాకాలంలో మరీ అధ్వానం

ఈ రహదారిపై సంబంధిత కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేయడంతో అత్యవసర వేళ, రాత్రి సమయంలో వర్షాకాలంలో రోడ్డుపై ప్రయాణించాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఇక్కడి రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు భైంసా, నిర్మల్ తదితర ప్రాంతాలకకు తరలించాలంటే ఈ రహదారిపై వాహన చోదకులు రావడానికి జంకుతున్నారు. కంకర తేలి ఉండడంతో వాహనం రోడ్డుపై నడపలేని పరిస్థితి నెలకొందని వాహన చోదకులు పేర్కొంటున్నారు. అంతేగాకుండా రాత్రి వేళల్లో అత్యవసర సమయంలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఎదురైతే ఆసుపత్రికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా మారుమూల గ్రామానికి రోడ్డు వేస్తే బాగుంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది: రాథోడ్ నరేష్, రాజాపూర్



మా గ్రామం నుంచి కుంటాలకు ప్రతీరోజు విద్యార్థులను పాఠశాలకు ఆటో ద్వారా తీసుకెళతాను. అయితే వర్షం కురిసిన సమయంలో, ఇతర సమయాల్లో రోడ్డుపై కంకర తేలి ఉండడంతో ఆటో నడపలేని పరిస్థితి నెలకొంది. రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. ఏదైనా పనుల కోసం మండల కార్యాలయానికి వెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా, రైతులు ఉత్పత్తులు విక్రయించేందుకు వెళ్లాలన్న ఇబ్బందికరంగా మారింది.

ఆయన కుంచె పడితే అద్భుతమే!

● చిత్ర కళలో రాణిస్తున్న రవి 'తేజం' ● వృత్తి ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి చిత్రలేఖనం ● ఆకట్టుకుంటున్న రవి తేజ చిత్రాలు ● డ్రాయింగ్‌పై విద్యార్థులకు అవగాహన



ఎడ్లబండిపై వెళ్తున్న రైతు చిత్రం



ప్రధాని నరేంద్ర మోదీ డ్రాయింగ్



పల్లెటూరి చిత్రం..



చిన్నారి కలర్ ఫొటోతో డ్రాయింగ్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆయన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. వృత్తి ఉపాధ్యాయుడైన.. చిత్రలేఖనం తన ప్రవృత్తిగా మార్చుకున్నాడు.. ఆయన కుంచె పడితే జీవం ఉట్టిపడాల్సిందే.. అతడి కుంచె నుంచి జాలు వారిన చిత్రాలు అద్భుతం.. అతను గీసిన ప్రతి బొమ్మా ఆలోచింపజేస్తుంది. ఇప్పటికే పలు రకాల చిత్రాలను గీసి అందరినీ ఆకట్టుకుంటున్నాడు.. కళ్ల ముందు కనిపించే దృశ్యాలకు, కలల ప్రపంచంలోని ఊహలకు ప్రాణం పోసేది చిత్రకళ.. సాంకేతికత ఎంత అందుబాటులో ఉన్న.. చేతితో తీర్చిదిద్దే అపురూపమైన చిత్రాలతో ఉట్టిపడే జీవకళే వేరు.. సాధనతో పాటుగా కాస్తంత సృజనాత్మకత జోడిస్తే కంచెతో అద్భుతాలే సృష్టించొచ్చునని నిరూపిస్తున్నాడు ఆ ఉపాధ్యాయుడు.. తన చేతితో ఎన్నో అందమైన చిత్రాలను గీస్తూ చిత్ర కళలో రాణిస్తున్న ఆ ఉపాధ్యాయుడిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

ఆకట్టుకునే చిత్రాలు వేస్తున్న రవితేజ

రవితేజ అనేక ప్రకృతి చిత్రాలు, సందేశాత్మక చిత్రాలు, ప్రముఖుల స్ఫూర్తి ముఖ చిత్రాలూ, అసలైన పల్లె చిత్రాలు, తల్లి బిడ్డల అనురాగా దృశ్యాలు, అన్నదాత పచ్చని పంటల చిత్రాలు సజీవంగా ఆవిష్కరించేలా గీసి ఎన్నో ప్రశంస లు పొందుతున్నాడు. అదే విధంగా వాటర్ కలర్ పెయింటింగ్‌తో వేసే చిత్రాలు అచ్చు గుద్దినట్లు కనిపిస్తాయి.



ఆకులపై అందమైన చిత్రాలు

రవితేజ పెన్సిల్‌తో చిత్రాలను వేయడం కాకుండా.. తన నైపుణ్యంతో ఆకులపై బ్లేడును ఉపయోగిస్తూ ఓ రూపం వచ్చే విధంగా చిత్రాలను అందంగా వేస్తుంటాడు. ఇలా వేసిన వాటిని వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి అందరి మనలను పొందుతున్నాడు. సోషల్ మీడియాలో ఈ ఉపాధ్యాయుడి వేసిన ఫాలోవర్స్ చాలా మంది ఉన్నారు.

బొమ్మలు వేస్తున్న ఉపాధ్యాయుడు రవితేజ

దారంతో అద్భుత చిత్రాలు

రవితేజ అందరూ వేసే విధంగా చిత్రాలను వేయడమే కాకుండా సరి కొత్త ఆలోచనలతో ఆలోచనలతో ఆర్ట్సు కూడా వేయడం మొదలు పెట్టాడు.. ఒక అట్టముక్కపై 360 డిగ్రీస్‌లో మేకులు కొట్టుకొని దారంతో ఓ రూపం వచ్చే విధంగా బొమ్మలు వేయడానికి త్రెడ్ అంటారు.. ఇలాంటి ఆర్ట్స్ అరుదుగా వేస్తుంటారు. దీనికి చాలా సమయం పడుతుంది.. ఇలాంటి అరుదైన త్రెడ్ ఆర్ట్‌ను కూడా రవితేజ వేస్తు అందర్నీ అబ్బురపరుస్తున్నాడు..



రావి ఆకుపై చిన్నారి చిత్రం

డ్రాయింగ్ టీచర్ కావడమే లక్ష్యం

● కలేరి రవితేజ ఉపాధ్యాయుడు, ఉట్నూర్

విద్యార్థులకు చదువుతోపాటు డ్రాయింగ్‌పై ఆసక్తి పెంచేలా కృషి చేస్తున్నాను. చిత్ర లేఖనం అనేది ఓ గొప్ప ఆర్ట్.. అది నేర్చుకోవడం చాలా గొప్ప విషయం.. నేను పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు డ్రాయింగ్ కూడా నేర్పిస్తున్నాను.. భవిష్యత్‌లో డ్రాయింగ్ టీచర్ కావడమే నా లక్ష్యం..

తల్లి తన బిడ్డకు స్నానం చేయిస్తూ ఆనందం పొందుతున్న అపురూప చిత్రం..







విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న తిరుపెల్లి రామాలయం

నామినేటెడ్.. ఇంకెప్పుడు?





- కాంగ్రెస్‌లో ఆశావహ నేతల ఎదురుచూపులు
- డీసీసీ, గ్రంథాలయ, మార్కెట్ చైర్మన్ పదవులపై కనిపించని కదలిక
- సెగ్మెంట్ ఇన్‌చార్జిల నిర్ణయమే ఫైనల్ అంటూ ప్రచారం
- నేతల మధ్య వర్గపోరుతో వాయిదా పడుతూ వస్తున్న ముహూర్తం
- హైకమాండ్ తీరుపై కాంగ్రెస్ నేతల్లో బిన్నాభిప్రాయాలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నో ఏళ్లగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న కాంగ్రెస్ నేతల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ అధికారంలోకి వస్తే తమ బతుకులు బాగుపడుతాయని భావించిన వారంతా.. ప్రస్తుతం నిరాశగానే కనిపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోతున్నా.. నామినెట్ పదవులను భర్తీ చేయక పోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉండి ఏం ప్రయోజనమంటూ సొంత పార్టీ నేతలే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. అధిష్ఠానం పెద్దలు నామినెట్ పదవులపై నాన్చుడు ధోరణిని అవలంబిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిగో.. అదిగో.. అంటూ కాలం గడుపడమే తప్ప నామినెట్ పదవుల కేటాయింపుపై అసలు ఊసెత్తడమే లేదంటున్నారు. రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొందరు బీఆర్‌ఎస్ ముఖ్యనేతలంతా కాంగ్రెస్‌లో చేరిపోయారు. అయినా ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పార్టీలో ఎలాంటి బాధ్యతలను అప్పగించక పోవడంతో సీనియర్లంతా సైలెంట్‌ పోయారు. దీంతో పార్టీ పరిస్థితులు పట్టుతప్పే ప్రమాదం ఉందన్న విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమిపాలు కావడంపై సొంత పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విజయ డెయిరీ, డీసీసీ, గ్రంథాలయ చైర్మన్, మార్కెట్ కమిటీ, దేవాదాయ చైర్మన్, ఐసీడీఎస్ చైర్మన్ పదవులపై ఆశావహ నేతలు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. మొదట సంక్రాంతి పండుగకు పదవులను భర్తీ చేస్తామని చెప్పినా.. ఆ తర్వాత ఉగాది కానుకగా నామినెట్ పదవులను కేటాయిస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నామినేట్ పదవులపై నాన్చుతు రావడంతో ఆశావహ నేతలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

ఊరిస్తున్న పదవులు

జిల్లా కాంగ్రెస్ నేతలను నామినేటెడ్ పదవులు ఊరిస్తూ వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు రాష్ట్ర స్థాయి పదవులు దక్కలేదు. దీంతో వెనుకబడిన జిల్లాలో పార్టీ పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఖానాపూర్‌లో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. మిగితా మూడు నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లదే పైచేయి కనిపిస్తుంది. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కూడా జిల్లాపై పెద్దగా దృష్టి సారించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. పార్టీ అధికారంలోకి వస్తే ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల సమయంలో పార్టీలో చేర్చుకున్న వారితో పాటు సీనియర్ నేతలు కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని నామినేటెడ్ పదవులు ఊరిస్తూ వస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో పార్టీని ముందుకు నడిపించే నాయకుడే లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండు మూడేళ్లుగా డీసీసీ పదవి ఖాళీగానే కనిపిస్తుంది. అలాగే గత ప్రభుత్వం విజయ డెయిరీ చైర్మన్ పదవిని జిల్లాకు చెందిన నేతకు కేటాయించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరున్న ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని భర్తీ చేయడంలోను నిండు నిర్లక్ష్యమే కనిపిస్తుంది. అలాగే ఐసీడీఎస్, గ్రంథాలయ చైర్మన్ పదవుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత, మాజీ ఎంపీ సోయంబాపురావుతో పాటు ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులకు ఏదో ఒక పదవి దక్కుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది.


నేతల మధ్య పోటాపోటీ

గత కొంత కాలంగా నామినేటెడ్ పదవుల కోసం నేతలంతా పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాని నియోజక వర్గ ఇన్‌చార్జిల నిర్ణయమే ఫైనల్ అంటూ ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే తమ అనుచరుల పేర్లతో కూడిన జాబితాలను అధిష్ఠానం పెద్దలకు పంపినట్లు తెలుస్తుంది. దీంతో ఆశావహ నేతలు ఇన్‌చార్జిల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులే ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ఆదిలాబాద్‌లో సీనియర్ నేతలైనా గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డి, సాజిద్‌ఖాన్‌లను పార్టీ పక్కన పెట్టడంతో కంది శ్రీనివాస్‌రెడ్డిదే హవా కనిపిస్తోంది. అయినా కొంతమంది కాంగ్రెస్ నేతలు రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. బోథ్‌లో మాజీ ఎంపీ సోయం బాపురావు వద్దకు పలువురు ఆశావహులు క్యూ కడుతున్నారు. ఖానాపూర్ లో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు చెప్పిందే ఫైనల్‌గా మారే అవకాశం కనిపిస్తుంది. కానీ ఇక్కడ ఓ మహిళ నేత కీలకంగా మారడం పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసిఫాబాద్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే కాంగ్రెస్‌లో లాబియింగ్ చేసిన వారికే పదవులు దక్కుతాయన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.

తలనొప్పిగా కుమ్ములాటలు

నేతల మధ్య ఆధిపత్యపోరు మరింత పెరిగిపోవడంతో పార్టీకి

(తరువాయి 6వ పేజీలో...)



నేడే శ్రీరాములోరి కల్యాణం

● ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరామనవమి సందర్భంగా చాందా రామాలయం, తిరుపెల్లి రామాలయం, తాటిగూడలోని శ్రీకోదండ రామాలయం, హౌజింగ్ బోర్డులోని రామాలయాలను అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యుత్ దీపాలతో ఎంతో సుందరంగా ముస్తాబు చేశారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. నవమిని పురస్కరించుకొని ఆదివారం ఆలయాల్లో వేద పండితులతో సీతారాముల కల్యాణంతో పాటు పట్టాబిషేకం, ఇతర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వైభవంగా సీతారాముల పల్లకీ ఊరేగింపు

బోథ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నూరు(బి) గ్రామంలో శనివారం శబరిమాత ఆశ్రమం నుంచి పురవీధుల గుండా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాల ఇంద్రారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



జైనథ్‌లో మాట్లాడుతున్న రూరల్ సీఐ సాయినాథ్

పెన్‌గంగా నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు : సీఐ

జైనథ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దున గల పెన్‌గంగా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ డిసాయినాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో పెన్‌గంగా గ్రామాల వీడీసీ సభ్యులతో కలిసి మాట్లాడారు. పెన్‌గంగా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను సీజ్ చేసి కోర్టుకు తరలించి వారి పై దొంగతనం కేసులను నమోదు చేస్తున్నామన్నారు. అభివృద్ధి కమిటీ పేరు మీద ఇసుక వేలం వేసి డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సై వి.పురుషోత్తం, పెన్‌గంగా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

● దేశీదారుపై ఉక్కుపాదం మోపుతాం

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల్లో నిషేధిత దేశీదారు విక్రయిస్తే ఉక్కుపాదం మోపుతామని రూరల్ సీఐ డి.సాయినాథ్ అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం మండలంలోని బెల్గావ్‌లో ఎస్సై వి.పురుషోత్తం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దేశీదారు విక్రయిస్తున్న మేస్రం పొచ్చిరాంను అదుపులోకి తీసుకుని 28 దేశీదారు సీసాలను రూ.2400 నగదును స్వాధీనం చేసుకుని నిందితున్ని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సిరాజ్‌ఖాన్‌తో పాటు జైనథ్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

● సైబర్ క్రైమ్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బేల: ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు శనివారం ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో మండలం మండలంలోని అవల్‌పూర్ గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ డి.సాయినాథ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దివ్యభారతి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బట్టిసావర్గంలో అవగాహన కార్య క్రమం

మావల: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని రూరల్ సిఐ ఫణిందర్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా బట్టిసావర్గం గ్రామంలో శనివారం గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మావల ఎస్సైయ్ విష్ణు వర్ధన్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో యువత ముందుండాలి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో యువత ముందుండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. వీజీఎస్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొంది ఇటీవల అగ్నివీర్ (ఆర్మీ)కు ఎంపికైన ఎనిమిది మంది అభ్యర్థులను శనివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అగ్నివీర్‌లో ఉద్యోగాలు చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం గొప్ప అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, వీజీఎస్ రాకేష్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఉట్నూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఉట్నూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్నామని బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్ తెలిపారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటలకు వినాయకచౌక్ పాత బస్టాండ్‌లో నిర్వహిచడం జరుగుతుందని, పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో జయంతి వేడుకలు ● పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 05 (ఆంధ్రజ్యోతి) : బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యా, రాజకీయ వేత్త, గొప్ప సంఘ సంస్కర్త అయిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని, ఆ మహనీయులను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. స్వతంత్ర యోధుడు, బలహీన వర్గాల ఆశా జ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద కలెక్టర్‌తో పాటు ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అధికారులు, వివిధ సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక ఎస్‌టీయూ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఆ మహనీయుడు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. మహనీయుల జీవిత చరిత్రలను ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సమసమాజ స్థాపన కోసం వారు చేసి కృషిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతీఒక్కరు పాటు పడాలని పిలుపునిచ్చారు. జగ్జీవన్ రాం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, డీఎస్‌సీడీడబ్ల్యూం సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు ఉట్నూర్ ఏజెన్సీలో శనివారం ఘనంగా జరిగాయి.



● నేరడిగొండలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



● ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

ఉట్నూర్ ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సక్రమంగా అందినప్పుడే మహనీయుల కలలు సాకారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఈఈ తానాజి పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్,మేనేజర్ శ్యామల, తదితరు పాల్గొన్నారు. అలాగే, ఉట్నూర్ పట్టణంలోని అంగడి బజార్ వద్ద ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో ముడుగు శామ్యూల్, జాదవ్‌చంద్రకాంత్, బిరుదుల లాజర్, కుటికల ఆశన్న, లింగంపల్లి చంద్రయ్య, దూట రాజేశ్వర్, నాతరిరమేష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, హస్నాపూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు దాసరి రాంప్రసాద్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఇందులో మండల ఇన్‌చార్జీ పరుశురాం మాదిగ, నాయకులు మాంగ్ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే షాంపూర్, దంతనపల్లిలలో జగ్జీవన్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

నేరడిగొండ: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్విహించారు. ఈ కార్యక్రమాలలో



● జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఎంపీడీవో రాజ్‌వీర్, తహసీల్దార్ ఖలీం, ఎంఆర్‌ఐ నాగోరావు, ఏపీవో వసంత్‌రావు, శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ జహీర్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: 45 ఏళ్ల కాలం పాటు సుదీర్ఘ రాజకీయ అనుభవంతో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన బాబూ జగ్జీవన్‌రామ్ నేటితరం నాయకులకు సమాజానికి ఆదర్శప్రాయుడని తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్‌లు పేర్కొన్నారు. శనివారం ఆయా కార్యాలయాలలో బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: భారత తొలి దళిత ఉప ప్రధాన మంత్రి, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్ రెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఈవో సంజీవ్ రావు ఆధ్వర్యంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌ఐ రోహిదాస్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సోనాల: ఆనాటి సమాజంలో చదువుకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్న దళిత గిరిజనుల కోసం శ్రమించిన సంస్కరణ యోధుడు జగ్జీవన్‌రామ్ అని తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోతన్న, సదానందం, రవీందర్, దినేష్, భీమ్రావు, అమృత్ రావు, సంతోష్, హరీష్, మహేశ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జెండా తొలగింపుపై ఆదివాసీలతో చర్చా వేదిక

● స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్పీ పర్యవేక్షణ

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరాసుక్క స్మారక జెండాను ఇటీవల గుర్తుతెలియని దుండగులు తొలగించిన విషయంపై శనివారం కేస్లాపూన్ నాగోబా దర్బర్‌లో ఉమ్మడి జిల్లా నాలుగు సెగల ఆదివాసీలతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ చర్చా వేదికలో ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన నాలుగు ఆదివాసీలు జెండా తొలగించిన విషయంపై ఆదివాసీ పెద్దలతో చర్చించారు. కాగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌లు ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్ కొనసాగుతున్న ఆదివాసీల చర్చా వేదికను ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ పర్యవేక్షణ చేశారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా ఆదివాసీలు

దాబాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

గుడిహత్నూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దాబాలలో మద్యం విక్రయాలు జరిపినా, తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని ఆయా దాబా యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దాబాలలో మద్యం సేవించినా, విక్రయించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాబా హోటల్లో కేవలం ఆహార భోజనాలు మాత్రమే జరపాలని, దాబాల్లో మద్యాన్ని సేవించే అవకాశం కల్పిస్తే దాబా యజమానులపై కేసులు నమోదు చేసి దాబా హోటళ్లను తాత్కాలికంగా మూసివేస్తామని హెచ్చరించారు. దాబాలలో మద్యం తాగి వాహనాలపై వెళ్తుంటే ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతుందన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దాబాకు వచ్చే ప్రతి వాహనం పార్కింగ్ స్థలంలోనే నిలిపివేసి విధంగా చేసుకోవాలన్నారు. రోడ్డు పక్కన ఉన్న దాబా రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయవద్దన్నారు. దాబాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు నేరస్తులు పాల్పడే విషయాలను మాట్లాడిన విషయాలను ఆయుధాలు, గంజాయి, మాదక ద్రవ్యాలు కనిపించిన స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వివరాలు ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ప్రతీ దాబాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, డీసీ ఆర్పీ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐలు సాయినాథ్, పనిధర్, భీమేష్, ఎస్సైలు మహేందర్, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



గుడిహత్నూర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

● ప్రతీఒక్క పోలీసుకు క్రమశిక్షణ తప్పనిసరి

ఆదిలాబాద్ రూరల్: ప్రతీఒక్క పోలీసుకు క్రమశిక్షణ తప్పనిసరి అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పరేడ్ వల్ల క్రమశిక్షణ, ఆరోగ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. శనివారం ఆదిలాబాద్ పోలీసు హెడ్ క్వార్టర్స్ పరేడ్ నిర్వహణ నిర్వహించగా ఎస్పీ పర్యవేక్షించారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి పోలీసు క్రమశిక్షణ అనేది మెరుగు పడుతుందని, ప్రతీ పోలీసుకు క్రమశిక్షణ అనేది ముఖ్యమైందని తెలిపారు. సిబ్బందికి వారాంతపు సెలవు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, ఇన్స్‌పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.